క్లుప్తంగా

సంక్రాంతి ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్, అవోపా, వామ్ సభ్యులు

ఆదోని అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్, అవోపా, వామ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో దాదాపు 50 మంది విద్యార్థులు చక్కటి రంగవల్లులు వేసి అలరించారు. లయన్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు రాజేశ్వరి, భవానీ, సాయిభవిత, ఉషారాణి, అంజలికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశిష్ట సభ్యులు వనపరాజు, ఓంప్రకాష్, అవోపా సభ్యులు రఘు, ఈరన్నశెట్టి, మమత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రామ్మూర్తి

పెద్దకడబూరు : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించి నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ రామ్మూర్తి సూచించారు. మండల పరిధిలోని తారాపురం ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించి, ఎస్‌ఏ మార్కుల ఎంట్రీ, విద్యార్థుల షూ సైజ్ ఎంట్రీ, ఉపాధ్యాయుల అఫీషియల్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. పాఠశాలలకు రాని విద్యార్థులు ఉంటే వారి ఇళ్లకు వెళ్లి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం అమర్‌కు సూచించారు.

ఇంటి స్థలాలపై రేపు ధర్నా

ఎమ్మిగనూరుటౌన్: సీపీఐ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. గద్దెనెక్కి నెలలు గడుస్తున్నా పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఇంటి స్థలాల కోసం గ్రామ, వార్డు సచివాలయాలు, తహసీల్దార్, సబ్‌కలెక్టర్, కలెక్టరేట్‌ల ముందు ధర్నా నిర్వహించి, వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. సమావేశంలో సీపీఐ నాయకులు రంగన్న, పంపణ్ణ గౌడ్, భాస్కర్‌యాదవ్, జబ్బార్, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి



నదికైరవాడిలో రీ సర్వేపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం : భూముల రీ సర్వే పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నదికై రవాడి గ్రామంలో రీ సర్వేపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి నదికై రవాడి గ్రామంలో భూ సమస్యలపై సమగ్ర భూ రీ సర్వే ప్రారంభమవుతుందన్నారు. రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాడానికి ఈ సర్వేను వినియోగించుకోవాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద నందవరం మండలంలోని నదికై రవాడి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు వివరించారు. వీఆర్వో, గ్రామ సర్వేయర్ టీమ్‌తో ప్రతి రోజు 20 ఎకరాలను సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ మహేష్, మండల సర్వేయర్ అక్బర్‌బాషా, ఆర్‌ఐ సుబ్బారెడ్డి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ తీరుకు నిరసనగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ఖాళీ ప్లేట్లు చేతపట్టి దుకాణాల వద్దకు వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్‌బాషా, రాష్ట్ర సమితి సభ్యుడు విజయేంద్ర, నాయకులు విష్ణు, అబ్దుల్‌ఖాదర్, రంగస్వామి, వీరేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పేరు ఘనం..
వసతులు అధ్వానం

- బనవాసి గురుకులానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం
- ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు
- కళాశాలలో విద్యార్థినులకు సౌకర్యాలు కరువు
- శిథిలావస్థలో డార్మిటరీ, చాలీచాలని మంచాలు
- స్టాఫ్ నర్స్‌లేక ఇబ్బందులు



వంట గదికి సరఫరా అయ్యే నీటి ట్యాంక్‌కు పాచిపట్టిన దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పచ్చదానానికి మారు పేరయిన బనవాసి ఆటవీ ప్రాంతంలో ఏపీ గురుకుల బాలికల కళాశాలను (ఏపీఆర్‌జేసీ) ఏర్పాటు చేశారు. ఈ కళాశాలకు రాష్ట్రంలోనే మంచిపేరు ఉంది. ప్రతి ఏటా ఇక్కడి విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అయితే కళాశాలలో మాత్రం సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన డార్మిటరీలు, కుళాయిలు, ఇరుకైన గదులు తదితర సమస్యలతో కాలంవెళ్లదీస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కళాశాలలో విద్యార్థిలపై లైంగికవేధింపుల ఘటనలు కూడా వెలుగులోకి వస్తుండటం కళాశాలకు మాయని మచ్చగా మారుతోంది. విద్యార్థినుల సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరం.

కార్పొరేటుగా దీటుగా విద్యాబోధన

రాయలసీమలోనే 14 ఏపీ గురుకుల కళాశాలల్లో ఎమ్మిగనూరు మండలం బనవాసి ఏపీ గురుకుల కళాశాలకు ప్రత్యేక స్థానం ఉంది. బనవాసి ఫారంలోని ఏపీ గురుకుల కళాశాలలో కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థినులు 260 మంది ఉన్నారు. విద్యాబోధనలో పేరెన్నికగన్న కళాశాలలో విద్యాభివృద్ధితోపాటు క్రీడల్లోనూ విద్యార్థినులు రాణిస్తున్నారు. ఇక్కడ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యా బోధన ఉండటంతో ఇక్కడ చేరడానికి విద్యార్థినులు పోటీపడుతుంటారు. అయితే వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక్కడ విద్యార్థినుల సమస్యలను చూసి ప్రభుత్వాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించ పోవటం శోచనీయం. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధుల హడావుడి చేయడం తప్ప ఏమీ ఉండదు. కొన్ని రోజుల తరువాత షరామామూలే అన్నట్లుగా అటువైపు చూడరు.



డార్మిటరీలో గోడకు పగుళ్లు



వాష్ రూమ్ దగ్గర ఉన్న వాటర్ ట్యాంక్ చుట్టూ నిల్వ ఉన్న నీరు

విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు

- ప్రధానంగా విద్యార్థినులు పడుకునే డార్మిటరీలు శిథిలావస్థలకు చేరుకున్నాయి. డార్మిటరీ గదులకు పగుళ్లు ఇవ్వటంతో ఎప్పుడు కూలుతుందోనని భయపడుతూ విద్యార్థినులు నిద్రిస్తున్నారు. వర్షకాలంలో పరిస్థితి మరింత ఘోరంగా ఉంటుంది. వర్షం వస్తే డార్మిటరీ రేకుల షెడ్‌పై నుంచి వర్షం నీరు కారుతుంది. దీంతో రాత్రంగా జాగరణ చేయాల్సిందే. శిథిలమైన డార్మిటరికీ సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేశారు. నెర్రలు బారిన గదులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. రాత్రి పూట విష పురుగులు లోపలి వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాకుండా గదులు ఇరుకూగా ఉండటం, సరిపడా మంచాలు లేవు. దీంతో మంచాలు దగ్గర దగ్గరగా వేసి రెండు మంచాలపై ముగ్గురు విద్యార్థినులు నిద్రిస్తున్నారు. కళాశాలలో చదివేవారందరూ బాలికలే కాడవంతో రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులపై ఉంది.
- విద్యార్థినుల ఆరోగ్య విషయాలను చుసుకోవడానికి స్టాఫ్ నర్సు ఉండాలి. నర్సులేక పోవడంతో విద్యార్థినులకు జ్వరాలు వచ్చిన, కడుపు నొప్పివచ్చినా ఎమ్మిగనూరు పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. అంతేకాకుండా వెళ్లటానికి ప్రభుత్వ వాహనం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. బాలికల ఆరోగ్య విషయలు చెప్పుకోలేనివి, వీటిని దృష్టిలో పెట్టుకొని స్టాఫ్ నర్సు తప్పనిసరిగా నియమించాలి.
- మూడు బ్లాక్లలో 300 వాష్ రూమ్స్ ఉన్నా విద్యార్థినులకు అవసరమైన విధంగా నిర్మాణం చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- వంట గది శిథిలావస్థకు చేరుకుంది. వంట గదిలో వస్తువులు పెట్టుకోవటానికి ఎటువంటి సౌకర్యాలు లేకపోవటంతో కూరగాయాలు నేలపైనే ఉంచుకోవాల్సి వస్తోంది. గది గోడ శిథిలమై కూలటానికి సిద్ధంగా ఉంది.
- కళాశాలలో రాత్రిళ్లు విధులు నిర్వహించటానికి రెగ్యూలర్ వాచ్‌మెన్ లేకపోవడం ఓ సమస్యగా తయారయ్యింది. డైలీ వేజ్ కింద వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయడంతో అధ్యాపకులే రాత్రిళ్లు విద్యార్థినుల స్టడీ అవర్ అయిపోయే వరకు తిరుగుతుంటారు. విద్యార్థినులు చదువుకోవటానికి స్టడిరూమ్ లేక పోవడంతో ఆరుబయట చెట్ల కింద చదువుకుంటున్నారు.
- డిజిటల్ తరగరులు బోధించేదుకు ప్రత్యేక గది లేకపోవడంతో ఒకే తరగతి గదిలో డిటిజల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. దీంతో ఒకే తరగతి విద్యార్థినులు డిటిటల్ క్లాసులు వినడానికి అస్కారం ఉంటుంది. ప్రత్యేక గదిని నిర్మిస్తే అందులో డిజిటల్ క్లాస్లులు బోధిస్తే విద్యార్థినీలందరికీ ఉపయోగపడుతుంది.

గత నాలుగేళ్లుగా విద్యార్థినులు సాధించిన ఫలితాలు

విద్యా సంవత్సరం	ఉత్తీర్ణత శాతం
2020-21	100
2021-22	97
2022-23	99.25
2023-24	100



ఇరుకుగా ఉన్న డార్మిటరీ గది

సొసైటీ దృష్టికి సమస్యలు తీసుకెళ్లాం



కళాశాలలో ఉన్న సమస్యలను ఏపీ గురుకుల కళాశాలల సొసైటీకి, సెక్రటరి దృష్టికి తీసుకెళ్లాం. మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరినా ఇంత వరకూ ఎటువంటి చర్యలు లేవు. విద్యార్థినులు రాత్రి పూట పడుకునేందుకు ఉన్న డార్మిటరీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలుతాయోనని భయపడుతున్నాం. వాటి స్థానంలో కొత్త భవనాలు ఏర్పాటు చేస్తే సమస్య ఉండదు. సమస్యలను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి వివరించాం.
– గిర్వాణి, ప్రిన్స్‌పాల్ ఏపీఆర్‌జేసీ, బనవాసి

- ఇటీవల కళాశాలలోని విద్యార్థినులపై లైబ్రేరియన్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడనే విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై విద్యార్థినులు ఆందోళనలు కూడా చేపట్టారు. అలాగే కళాశాలలో పురుష లెక్చరర్ల వల్ల ఇబ్బందిగా ఉందని, మహిళా అధ్యాపకులను నియమించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

వలసల నివారణకు ఉపాధి పనులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

గోనెగండ్ల: గ్రామాల్లోనే ఉపాధి హామీ పనులు కల్పిస్తాం, ఎవరూ వలస వెళ్లొద్దని ఉపాధి హామీ పథకం డ్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో గ్రామస్తులకు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించారు. పీడీ మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన వారందరికీ గ్రామంలోనే ఉపాధి హామీ పనులు కల్పిస్తామన్నారు. జాబ్ కార్డు కలిగిన వారికీ 150 రోజుల పనిదినాలు ఉంటాయని చెప్పారు. వారందరూ పనులు చేసుకోవచ్చన్నారు. నిర్ణీత కొలతలు ఆధారంగా పనులు చేసుకుంటే రూ.300 కూలీ పడుతుందన్నారు. కాబట్టి ఎవరు కూడా కుటుంబాలను వదిలి వలస వెళ్లొద్దని సూచించారు. అలాగే కొందరు చదువుకునే విద్యార్థులను, చిన్న పిల్లలను తీసుకెళ్లి అక్కడ సరైన సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వలస వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి హామీ పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణి మంజరి, ఏపీడీ అల్లీపీరా, ఏపీఓ మహబూబ్ బాషా, ఈసీ ఉస్మాన్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు చిట్టెమ్మ, వీరేష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోండి



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి

ఆదోని సెంట్రల్: పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్టీయూ వారు అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి తెలిపారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను దాతలు నాగరాజు స్వామి, బీచుపల్లి సహకారంతో పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్టీయూ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులకు సైతం అర్థమయ్యే విధంగా వివిధ అంశాలను స్టడీ మెటీరియల్‌ను రూపొందించడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అనంతరం నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ(జనరల్), కేజీబీవీ(మైనార్టీ) పాఠశాలల్లో 350 మంది విద్యార్థులకు స్టడి మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు, ఎస్టీయూ నాయకులు నాగరాజు, రమేష్‌నాయుడు, వీరచంద్ర యాదవ్, లోక్యానాయక్, రవి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు



వందగల్లులో అర్జీలను విచారిస్తున్న తహసీల్దార్ నిత్యానందరాజు

కోసిగి: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగిశాయి. బుధవారం చివరిరోజు వందగల్లు గ్రామంలో తహసీల్దార్ నిత్యానందరాజు, సర్వేయర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భూముల సంబంధించిన వివిధ రకాల సమస్యలపై రైతులు అర్జీలు సమర్పించారు. తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ కోసిగి మండలంలో 28 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులను గతనెల 6వ తేదీ నుంచి ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ సమస్యలపై 439 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో ఇప్పటికే 145 అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. 294 పెండింగ్‌లో ఉండగా పూర్తి స్థాయిలో విచారణ చేసి పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓలు బసవరాజు, రైతులు పాల్గొన్నారు.

మారెమ్మ.. చల్లంగా చూడమ్మ



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



సిద్ధప్పపాళెంలో పూజలు నిర్వహిస్తున్న ప్రదీప్ రెడ్డి

కోసిగి: గ్రామ దేవత మారెమ్మదేవి చల్లంగా చూడమ్మా అంటూ కోసిగి ప్రాంత ప్రజలు అమ్మవారి దేవరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం కోసిగిలోని కడపాళెంలోని కిందగేరి మారెమ్మ దేవి, బసవన్న గట్టు సమీపంలో కందనాతి మారెమ్మ దేవి, చింతలగేని వీధిలోని ముసలి మారెమ్మ దేవి, పాత పోస్టాఫీసు రోడ్డులో దేవమ్మ, శాంతినగర్‌లో మారెమ్మ దేవి, నాడుగేని వీధి, సిద్దప్ప పాళెం కాలనీలో కొలువుతీరిన మారెమ్మ దేవి ఆలయాల్లో విశేష పూజలు చేపట్టారు. ఆయా కాలనీ వాసులు ఇంటింటా పూర్ణకుంభాలలో నైవేద్యం తయారు చేసి పురవీధుల గుండా ర్యాలీగా బయలు దేరి ఆలయాల చెంతకు చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి నైవేద్యం, నారికేలలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ప్రధానంగా దొరల చావిడి కాలనీ వాసులు ఒకే సారి 80కు పైగా పూర్ణకుంభాలతో నిర్వహించిన ఊరేగింపు ఆకర్షణీయంగా నిలిచింది. ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై అమ్మవార్లకు పూజలు నిర్వహించుకున్నారు. ఎంపీపీ ఈరన్న, నాయకులు నాడేగేని నాగరాజు, బండ్ల గోవిందు, గానిగ వీరస్వామి ఆధ్వర్యంలో వారికి ఆహ్వానం పలికారు.

ఘనంగా మారెమ్మవ్వ దేవర

పెద్దకడబూరు : మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో బుధవారం మారెమ్మవ్వ దేవర ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి కుంభాలతో ఊరేగింపుగా మారెమ్మవ్వ ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవర ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికార ప్రతినిధి రవిచంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో భజనలు

ఆదోని రూరల్: పట్టణ శివారు ప్రాంతంలోని భరత్ నగర్ కాలనీలో వెలిసిన వీరాంజనేయస్వామి ఆలయంలో 41వ రోజు పూజల సందర్భంగా భజన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున 3 గంటల వరకు ఆస్పరి మండలం పుప్పాలదొడ్డి భజన బృందం, కాలనీవాసులు భజనలు చేశారు. బుధవారం వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు ముగిశాయి. భజనల్లో పాల్గొన్న వారికి ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు అల్లీపుర మహదేవప్పతాత ఆరాధన

ఆదోని అర్బన్: పట్టణశివారులోని పర్వతాపురం రోడ్డులో వెలిసిన శ్రీ అల్లీపుర మహదేవప్పతాత ఆరాధనోత్సవం ఈనెల 10వ తేదీన ఉంటుందని మఠం కమిటీ అధ్యక్షులు తిమ్మన్నగౌడ తెలిపారు. తాతకు పంచామృతాభిషేకం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం తాత విగ్రహంతో మఠం ఆవరణలో రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

భూకబ్జాల సూత్రధారులను శిక్షించాలి

ఆదోని టౌన్: ఆదోని భూ మాఫియా పాత్రధారులు దొరికారు, ప్రభుత్వం తీగలాగి సూత్రధారుల డొంక కదిలించి కఠినంగా శిక్షించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఎ.నూర్‌అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భూ మాఫియా వల్ల ఆదోనికి చాలా చెడ్డపేరు రావడంతోపాటు వ్యాపారపరంగా కొన్ని వందల కోట్లు నష్టపోతోందన్నారు. ఇది పేద, మధ్యతరగతివర్గాలకు తీరని నష్టం కలిగిస్తుందన్నారు. పోలీసుశాఖ, ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపట్టి అసలు సూత్రధారులపై చర్యలు తీసుకోవాలని కోరారు

11న శనిదోష పరిహార పూజలు

ఆదోని అర్బన్: శనిత్రయోదశి సందర్భంగా ఈనెల 11వ తేదీన శనివారం మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ శ్రీపాదుల వారి ఆదేశాల మేరకు శనిదోష పరిహార పూజలు చేపడుతున్నట్లు ఆలయ మేనేజర్ కౌశ్లేష్‌ఆచార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం మంగరాయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. సాయంత్రం శనీశ్వరమూర్తికి తైలాభిషేకం, శాంతి హోమం నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది అర్ధాష్టమ, అష్టమ, ఏలినాటి శనిదోషాలతో బాధలు, కష్టాలు, అనారోగ్యం తదితర సమస్యలతో బాధపడుతున్న కర్కాటక, కన్య, కుంభ, మకర, మీన, వృశ్చిక రాశుల వారికి శనిదోష పరిహార పూజలు చేస్తామని చెప్పారు. పరిహార పూజలు చేయించుకోవాలనుకున్న వారు 9110731103 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

ఆదోని సెంట్రల్: వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని బుధవారం హాస్టల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం ఆహారం అందించాల్సిన సంక్షేమ అధికారులు నాణ్యతకు తిలోదాకలు ఇస్తున్నారన్నారు. ఇది ఏమని ప్రశ్నిస్తే బిల్లులు రాలేదని సమాధానం చెపుతున్నారన్నారు. అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వీరేష్‌ఆచారి, తిరుమల, గిరి, సోమ్‌శంకర్, పులిరాజు, బంగారయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ రూ.72.20 కోట్లు

- ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన కౌన్సిల్
- మిగులు బడ్జెట్ వినియోగంపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల వాగ్వాదం



బడ్జెట్‌పై వాగ్వాదం చేసుకుంటున్న కౌన్సిల్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపాలిటీ 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.72,20,66,856లు బడ్జెట్ అంచనాకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన బడ్జెట్‌పై సమావేశం జరిగింది. సమావేశంలో మిగులు బడ్జెట్ వినియోగించుకునేందుకు మున్సిపాలిటీలకే అవకాశం ఇచ్చారని టీడీపీ కౌన్సిలర్ దయాసాగర్ పేర్కొనగా అందుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులేమైనా ఉన్నాయా అంటూ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య కాసేపు వాగ్వాదంతో గందరగోళం ఏర్పడింది. చివరికి చైర్మన్ సూచనతో ఇరు పక్షాలు శాంతించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతునట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ప్రకటించారు.

కుక్కల బెడదను నివారించేదెన్నడు?

పట్టణంలోని 6వ వార్డులో కౌన్సిల్‌లో ఆమోదించిన పనులను టెండర్ల ద్వారా వాటిని దక్కించుకున్న కాంట్రాక్టర్ సతీష్ ఏళ్లు గడుస్తున్నా ఆయా పనులు చేయడం లేదని, ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆవార్డు కౌన్సిలర్ ఎంకే శివప్రసాద్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. 1, 22వ వార్డుల్లో కుక్కల బెడద నివారించాలని, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు చేపట్టాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా వార్డు కౌన్సిలర్లు కామర్తినాగేషప్ప, డిష్ కేశవ రెడ్డి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. తమ వార్డులో బోర్‌ను మరమ్మతు చేయాలని వైస్ చైర్మన్ దివ్యకళ చైర్మన్ ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.

కుక్కల బెడద నివారణకు టెండర్ పూర్తి

కౌన్సిల్ సభ్యుల ప్రశ్నలకు కమిషనర్ గంగిరెడ్డి సమాధానం ఇస్తూ.. కుక్కల బెడద నివారణకై కాకినాడకు చెందిన ఓ సంస్థ టెండర్ పొందిందని ఒక్కో కుక్కకు స్టెరిలైజ్ చేసేందుకు రూ.1500లు కోట్ చేయడం జరిగిందని తెలిపారు. అంతకుముందు కౌన్సిలర్ ఇషాక్ సతీమణి గుండెపోటుతో మృతి చెందడంతో ఐదు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశంలో డీఈ నీరజ, రాజునాయక్, విక్టర్, మేనేజర్ వరప్రసాద్, టీపీఓ రాజేష్ పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల

ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్ ఆవరణలో సీడీపీఓ సఫరున్నిసా బేగం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకై రూపొందించబడిన ఎస్‌డీజీ గోల్ యాప్ పై జిల్లా కోఆర్డినేటర్ బాలమద్దిలేటి శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌లలో 5ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

30 శాతం ఐఆర్ ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేసి, 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు, కార్యదర్శి గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 117 జీఓను రద్దు చేసి సమస్యలపై చర్చలకు ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. ఆయా సమస్యలపై ఈనెల 11వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల కృష్ణ, నాయకులు పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, రవీంద్ర పాల్గొన్నారు.

నాగలదిన్నెలో సీపీఐ జెండా ఆవిష్కరణ

నందవరం: సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో బుధవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించి కర్షకులు, కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, నాయకులు శాంతన్న, అబ్దుల్‌గపూర్, జబ్బర్, నబి తదితరులు పాల్గొన్నారు.